సాక్షి
శ్రీకాకుళం
బుధవారం ၊ 1 ၊ మే ၊ 2024



గోవిందా.. గోవింద

పాతపట్నంలో టీడీపీ ఖాళీ అయిపోతోంది. టికెట్ కేటాయించాక పరిస్థితి వారి చేయిజారింది.

- 8లో



నేడే.. మేడే

ఆమదాలవలస: ప్రపంచ శ్రామికుల దినోత్సవం సందర్భంగా సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. గాజులకొల్లివలసలోని సంగమేశ్వరఆలయం ఆవరణలో శ్రమజీవులకు అభినందనలు తెలుపుతూ రూపొందించిన శిల్పం ఆకట్టుకుంది.

2న ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియను ఈనెల 2న ఉదయం 8 గంటల నుంచి ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నామని ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేసారు. ఈ మేరకు సమాచారాన్ని గ్రామ పెద్దలు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖాధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశామని వివరించారు. నిబంధనల ప్రకారం లెక్కింపును చేపట్టేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

న్యూస్‌రీల్

రసాభాసగా టీడీపీ సమావేశం

ఎల్.ఎన్.పేట, పాతపట్నం: పాతపట్నంలో టీడీపీ నాయకులు నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశం రసాభాసగా మారింది. పాతపట్నంలోని ఓ కల్యాణ మండపంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీడీపీ రీజనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. మామిడి గోవిందరావు(ఎంజీఆర్), మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ వర్గానికి చెందిన నాయకులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో కొందరు నాయకులు ముందుగా కలమట వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఎంపీ రామ్మోహన్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎంజీఆర్ కుమారుడు మీ అందరూ మా వెనుకే ఉండాలని, అధిష్టానం మాకే టికెట్ ఇచ్చిందని అన్నారు. దీంతో వాగ్వాదం పెరిగింది. ఎంజీఆర్ మాట్లాడుతూ గతంలో తనను కూడా కలమట వర్గం ఇబ్బందులు పెట్టిందని, అధిష్టానం తగ్గమంటే తగ్గానని అందువల్లే స్పీడ్ పెంచలేకపోయానన్నారు. దీంతో కలమట వర్గం వారు జై కలమట అంటూ సమావేశంలో నినాదాలు చేస్తూ మా ఓట్లు వద్దా అని అడిగారు. దీంతో ఎంజీఆర్ కుమారుడు కలగజేసుకుని రెడ్‌బుక్‌లో పేరు రాస్తానని, మీ అందరి ప్రవర్తన తీరు కూడా రాసి పెడుతున్నానని బెదిరించారు. దీంతో రెండు వర్గాలు వాదులాడుకున్నాయి.

రికార్డుల నిర్వహణపై దృష్టి



మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల రోజువారీ ప్రచార వ్యయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు అన్నారు. రోజు వారీ నివేదికలు పంపించడంలో రికార్డుల నిర్వహణలో పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం ప్రత్యేక వ్యయ పరిశీలకులు శరవణ కుమార్, కోమల్ జీత్ మీనా, నవీన్ కుమార్ సోనీలు జిల్లా సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో సీజర్ నిర్వహణ, ఖర్చుల వివరాలు, ఆడిటింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బరిలో ఉన్న వారి తుది జాబితా ఖరారైన దృష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలని, సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, భారీ మొత్తంలో జరిగే లావాదేవీలు, నగదు డిపాజిట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పత్రికలు, చానెళ్లు, సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ఫిర్యాదులపై టోల్ ఫ్రీ నంబర్ల ప్రచురణ, ప్రసారం జరిగేలా చూడాలని సూచించారు. జీఎస్టీ సిబ్బంది పన్ను సంబంధిత ప్రయోజనం కోసం మాత్రమే తనిఖీ చేయవద్దని, ఓటర్లకు పంపిణీ చేయడానికి వస్తువులను పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడానికి జరిగే లావాదేవీలు కూడా తనిఖీ చేయాలని సూచించారు.

సరిహద్దులో చెక్‌పోస్టు పరిశీలన



చెక్‌పోస్టు వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఇచ్ఛాపురం: ఆంధ్రా ఒడిశా సరిహద్దు పురుషోత్తపురంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం పరిశీలించారు. ఇక్కడకు వచ్చిపోయే ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. చెక్‌పోస్టుతో పాటు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గల బెల్లుపడ, ఏఎస్‌పేటలను పరిశీలించారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నేరస్తులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆమెతో పాటు పలాస కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, పట్టణ, రూరల్, కవిటి ఎస్‌ఐలు ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ కోర్సులతో చక్కటి భవిష్యత్

టెక్కలి: స్కిల్ నైపుణ్యత కోర్సులతో ఎంతో భవిష్యత్ ఉంటుందని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల స్కిల్ హబ్ సెంటర్‌లో ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కిల్ నైపుణ్యత కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ ఎస్.శోభారాణి, ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, స్కిల్ హబ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఓ వైపు పంట పోయి, ఇళ్లు కూలిపోయి, తోటలు నాశనమై ఉద్దానం.. ఉద్దానమంతా ఏడుస్తుంటే.. టీడీపీ నాయకులు మాత్రం అంతటి శోకంలోనూ అవినీతి ఆపలేదు. పరిహారం పేరిట వచ్చిన డబ్బును ఫలహారంలా మింగేశారు. అనర్హులు, అనుయాయులు, బినామీల పేర్లను తిత్లీ బాధితుల జాబితాలో చేర్చి ప్రజా ధనాన్ని కొల్లగొట్టారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన రీ సర్వేతోనే అసలైన బాధితులకు న్యాయం జరిగింది. తిత్లీ వచ్చి ఇన్నేళ్లయినా అది వదిలిపెట్టిన విషాదంతో పాటు టీడీపీ నాయకులు చేసిన అక్రమాలు ఇంకా ఉద్దానం గుండెను గుచ్చుతూనే ఉన్నాయి.

తిత్లీ పరిహారం.. టీడీపీ ఫలహారం





- తిత్లీ పరిహారం తినేసిన టీడీపీ నేతలు
- అనర్హులకు, బినామీలకు పెద్ద ఎత్తున అనుచిత లబ్ధి
- అసలైన బాధితులకు మొండిచేయి
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అదనపు పరిహారం అందజేత
- రీసర్వేలో అక్రమార్కుల గుట్టు రట్టు చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

తిత్లీ తుఫాన్ ఉద్దానాన్ని తుడిచిపెట్టేసింది. ఒకే ఒక్క రాత్రి బతుకులను తల్లకిందులు చేసేసింది. కానీ తుఫాన్ చేసిన నష్టం కంటే టీడీపీ నాయకులు చేసిన నష్టమే ఉద్దానం వాసులను ఎక్కువగా బాధ పెట్టింది. తిత్లీ తుఫాన్‌తో రైతులు రోడ్డు పాలు కాగా, టీడీపీ నేతలు ధనవంతులయ్యారు. బాధితుల ముసుగులో తుఫాన్ పరిహారమంతా తమ ఖాతాల్లో వేసుకున్నారు. కింజరాపు అచ్చెన్నాయుడు, బెందాళం అశోక్, పలాస టీడీపీ నేతలు చేసిన మోసాలను అక్కడి ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారు.

లేని భూములు చూపించి, జరగని నష్టాన్ని లెక్కలోకి తెచ్చి, ఉన్న రికార్డులను మాయం చేసి, కొత్తగా రికార్డులను సృష్టించి... ఇష్టారీతిన తెలుగు తమ్ముళ్ల పేర్లతో పరిహారం జాబితాలను తయారు చేసి వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టం ప్రకారంగా కాకుండా టెక్కలిలోని ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి, ఉద్యానవన శాఖ అధికారులను దగ్గర పెట్టుకుని తమకు నచ్చిన, కావల్సిన రైతులు, బినామీల పేర్లను ఎక్కించి పరిహారం కోసం జాబితాలు తయారు చేసేశారు. దీంతో అనర్హులకు పెద్ద ఎత్తున పరిహారం అందింది. భూముల్లేని టీడీపీ సానుభూతి పరులకు భూములున్నట్టుగా చూపించి, తక్కువ భూమి ఉన్న టీడీపీ శ్రేణులకు ఎక్కువ భూమి ఉన్నట్టుగా నమోదు చేసి, పల్లం భూమిని మెట్ట భూమిగా నమోదు చేసి, పంచాయతీకి చెందని వ్యక్తులను స్థానికంగా చూపించి అప్పట్లో పరిహారం జాబితాలు తయారు చేశారు. అప్పటి మంత్రి, ఎమ్మెల్యేలు కింజరాపు అచ్చెన్నాయుడు, బెందాళం అశోక్ కుటుంబీకులు తదితరులు బంధువులను సైతం నష్టపోయినట్టు పరిహారం జాబితాలో చేర్చినట్టుగా ఆరోపణలు ఉన్నాయి.

అక్రమాల పుట్టకు ఆనవాళ్లివిగో..

- కవిటి మండలం జన్మభూమి కమిటీ సభ్యుడిగా ఉన్న బార్ల చిన్నబాబు సతీమణి మీరాబాయికి తిత్లీ తుఫాన్‌లో కొబ్బరితోటకు సంబంధించి నష్ట పరిహారం రూ.2,23,500 మంజూరైనట్టు నమోదైంది. 140/1, 22/1 అనే రెండు సర్వే నంబర్లలో 4.90 ఎకరాల విస్తీర్ణంలో నష్టపరిహారాలు చెల్లింపుల జాబితాలో నమోదయ్యాయి. వాస్తవానికి ఈ సర్వే నంబర్‌లో ఈమె పేరు లేదు. 22/1 సర్వే నంబరులో బార్ల చిన్నబాబు పేరిట 2.11 ఎకరాల భూమి రికార్డుల్లో ఉంది. బార్ల చిన్నబాబుకు వేరేగా తుఫాన్ పరిహారం జాబితాలో నమోదైంది.
- కవిటి మండలం బల్లిపుట్టుగ పంచాయతీకి చెందిన దొళాయి గీత పేరిట రూ.91,500 పరిహారం పొందినట్టు తిత్లీ తుఫాన్ కొబ్బరినష్టాల జాబితాలో నమోదైంది. ఈమె టీడీపీ నేత బృందావన్ దొళాయి భార్య. 59/3,61/1లో రెండు నంబర్ల కింద 2.08 ఎకరాలు నమోదైంది. అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం 59/3 సర్వే నెంబరులో ఈమె పేరున భూమి లేదు. ఇక మరో నెంబరు 61/1లో రాస్తా(రహదారిమార్గం) నంబరుగా నమోదై ఉంది. బార్ల చిన్నబాబు అనే టీడీపీ నేతకు ముఖ్య అనుచరుడుగా బృందావన్ దొళాయి పేరు పొందారు.
- కంచిలి, కవిటి మండలాల్లోని చాలా గ్రామాల్లో ఎక్కువ అక్రమాలు చోటు చేసుకున్నాయి. కంచిలి రెవెన్యూ పరిధిలోని కొబ్బరి తోటలే లేనప్పటికీ కొబ్బరి చెట్లు పడిపోయినట్లు పెద్ద ఎత్తున పరిహారం పొందటం విశేషం. మకరాంపురం గ్రామంలో భూస్వామిగా పేరొందిన నేత బినామీ పేర్లతో ఏకంగా రూ.80లక్షలు వరకు పరిహారాన్ని అక్రమంగా పొందారు. జాడుపూడి పంచాయతీ పరిధిలో ఏకంగా 110 మంది అనర్హులు తప్పుడు భూ వివరాలతో నష్టపరిహారం పొందారు.

పచ్చ పాపాలు- 4

- కొక్కిలిపుట్టుగ రెవెన్యూ పరిధిలో ఎలాంటి భూముల్లేని వారు సైతం తప్పుడు సర్వే నంబర్లు వేసుకొని, కొబ్బరికి సంబంధించిన నష్ట పరిహారం పొందారు. ఇవన్నీ బయటపడకుండా ఉండేందుకు మ్యూటేషన్లద్వారా పట్టాదారులు పాసు పుస్తకాలు తయారు చేయించుకోగా, మరికొందరు ఏకంగా పట్టాదారు పాసు పుస్తకాలనే ట్యాంపరింగ్ చేశారు. భూములున్న వారి పాసు పుస్తకాలపై ఫొటోలు, పేర్లు మార్చి, జిరాక్స్ కాపీలతో బురిడీ కొట్టారు.



విచారణలో బయటపడిన వాస్తవాలు...

- వాస్తవంగా 2018లో తయారు చేసిన జాబితాలో లక్షా 6వేల 788మంది నష్టపోయినట్టు పేర్కొన్నారు.
- రూ.258కోట్లు వారికి పరిహారంగా అందజేశారు.
- వీరిపై వివిధ శాఖల అధికారులు విచారణ చేపట్టగా 90,789 మంది మాత్రమే అర్హులున్నట్టు తేల్చారు.
- మిగతా 15,999 మంది అనర్హులుగా గుర్తించారు. ఈ లెక్కన ఎంత దోపిడీ జరిగిందో అర్థం చేసుకోవచ్చు.
- వైఎస్ జగన్ ప్రభుత్వం పెంచిన పరిహారం పంపిణీ చేసేందుకు చేసిన పరిశీలనలో అనర్హుల గుట్టు రట్టయ్యింది.
- రీ సర్వేలో కూడా తమ అక్రమాలు బయటపడకుండా ఉండటానికి చాలా ఎత్తులు వేశారు. అనేక రకాల మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు.
- వీటన్నింటిని గుర్తించడానికి అధికారులకు చాలా సమయం పట్టింది.
- తిత్లీ తుఫాన్ సమయంలో టీడీపీ నాయకులు గ్రామాల వారీగా కాగితాల్లో పంచేసుకుని పరిహారాన్ని కొట్టేశారు. ఒక గ్రామంలో ఉన్న భూమిని తమకింత అని చూపించుకుని, ఇన్ని చెట్లు పడిపోయాయని చెప్పి తిత్లీ పరిహారాన్ని నొక్కేశారు. ఏదో ఒక సర్వే నంబర్‌తో భూమిని చూపించి, నచ్చినంత సంఖ్యలో చెట్లు పడిపోయినట్టు నమోదు చేయించుకుని లక్షలాది రూపాయల పరిహారాన్ని మింగేశారు. చెప్పాలంటే నాడు మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చె న్నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ మనుషులు, బంధువులు తిత్లీ పరిహారాన్ని దోచేశారు. వారి అడుగు జాడల్లో ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కూడా పరిహారాన్ని ఫలహారంలా లాగించేశారు.

ఆధారం లేకుంటే అంతే..

- ఎన్నికల వేళ తనిఖీలు ముమ్మరం
- ఇప్పటివరకు రూ. 3.5 కోట్ల విలువైన నగదు, మద్యం, బంగారం స్వాధీనం



శ్రీకాకుళం క్రైమ్/ శ్రీకాకుళం పాత బస్టాండ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు, బంగారం, మద్యంను స్వాధీనం చేసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు చూసుకుంటే అక్రమ మార్గాల్లో తరలిస్తున్న రూ. 3.5 కోట్లకు పైగా విలువైన మద్యం, బంగారం, నగదును అధికార యంత్రాంగం స్వాధీనం చేసుకుంది.

రూ. 50 వేలుకు మించి నగదు తీసుకెళ్తే..

రూ. 50 వేలుకు మించి నగదును తమతో పాటు ఎవరైనా తీసుకెళ్లాలంటే వాటికి సంబంధించి బ్యాంకుల నుంచి ధ్రువీకరణపత్రాన్ని తీసుకోవాలి. అలాంటి పత్రాలు లేకపోతే ఫ్లయింగ్ స్క్వాడ్ ఆ నగదును సీజ్ చేసి ఆదాయపు పన్ను శాఖకు అప్పగిస్తారు. అన్ని ఆధారాలు కనుక ఉంటే జిల్లాలోని గ్రీవెన్స్ కమిటీ దీన్ని రిలీజ్ చేసే అవకాశం ఉంటుంది.

రూ. 1.30 కోట్ల నగదు, 3 కిలోల బంగారం సీజ్..

మార్చి నెల 16 నుంచి ఏప్రిల్ 28 వరకు ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు రూ. 1,30,18,920ను అధికారులు సీజ్ చేశారు. ఆభరణాల విషయానికి వస్తే రూ.1,36,80,284లు విలువైన 2,901 గ్రాముల (3కిలోలు) బంగారాన్ని, రూ. 14, 41,669 లు విలువైన 26,581 గ్రాముల వెండిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.


మద్యంపై కూడా..

జిల్లాలో భారీ ఎత్తున మద్యం సీజ్ చేసిన కేసులు నమోదయ్యా యి. 5,500 లీటర్ల సారా, 285 లీటర్ల ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్), ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి తరలిస్తున్న 1154 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి వినియోగించే 77వేల లీటర్ల భారీ బెల్లపు ఊట నిల్వలను ధ్వంసం చేశారు. వీటన్నింటి విలువ రూ.74 లక్షలు ఉంటుంది. 124 కిలోలకు పైగా గంజాయి కూడా పట్టుబడింది. దీని విలువ రూ. 5.36 లక్షలుగా నిర్ధారించారు. నగదు, మద్యం, గంజాయి, సారాయి వంటి అక్రమ రవాణాకేసులు 716 నమోదయ్యాయి. దీనిలో భాగంగా 459 మందిని అరెస్టు చేసి 36 ద్విచక్రవాహనాలు, 13 కార్లు, ఒక వ్యాను, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 87 లక్షలుగా ఉంది. సరైన పత్రాలు లేని కారణంగా 13 మొబైల్ ఫోన్లు, పది చేతి గడియారాలు, 14 చీరలు, పదివేల టీషర్టులు, 2500 కరపత్రాలు సీజ్ చేశారు. వీటి విలువ రూ. 7.5 లక్షలు ఉంటుంది.

సిబ్బందికీ ఇబ్బంది..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన ఘటనలు 93 చోటు చేసుకోగా 34 కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరిలో 67 మందికి నోటీసులు జారీ చేయగా 39 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. 17 మంది ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

24 గంటలూ పర్యవేక్షణ



జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పనిచేస్తున్నాయి. నియోజకవర్గానికి మూడు చొప్పున ఒక్కో బృందంలో ఆరుగురు వరకు సిబ్బంది 24 గంటలూ పనిచేస్తున్నారు. వారితో పాటు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టి టీములే కాక సరిహద్దుల్లో నిఘా బృందాలు పనిచేస్తున్నాయి. సరైన పత్రాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదు తమతో తీసుకెళ్లవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నిరంతర నిఘా కొనసాగుతుంది.

- రాఘువేంద్ర మీనా, అసిస్టెంట్ కలెక్టర్



కంచిలి: ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ఊరూరా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. మఠంసరియాపల్లి వీధుల్లో ఇలా ప్రచారంలో పాల్గొన్నారు.



స్పీకర్ తమ్మినేని సీతారాం గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. చింతలపేట గ్రామంలో ప్రచార రథంపై ఇలా తిరిగారు.

- ఆమదాలవలస రూరల్

జోరుగా.. హుషారుగా

పోలింగ్ తేదీ దగ్గర పడుతోంది. ఎన్నికల సమయం ముంచుకు వస్తోంది. అభ్యర్థులంతా వేగం పెంచారు. ఒక్క ఊరిని కూడా వదలకుండా అన్ని ప్రాంతాలనూ చుట్టేస్తున్నారు.

ప్రచార పర్వం



మంత్రి ధర్మాన ప్రసాదరావు గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కొమరవానిపేటలో ప్రజలనుద్దేశించి ఇలా ప్రసంగించారు.

- గార



మంత్రి అప్పలరాజు పల్లెలన్నీ చుట్టేస్తున్నారు. గోవిందపురంలో ఇలా ఆడపడుచుతో ఆప్యాయంగా మాట్లాడారు.

-వజ్రపుకొత్తూరు



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పోలాకిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులతో మమేమకయ్యారు.

- పోలాకి



ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎన్నికల ప్రచారాల్లో హుషారుగా పాల్గొంటున్నారు. మావరం గ్రామంలో ఇలా అభి వాదం చేస్తూ ర్యాలీ చేశారు.

- కొత్తూరు



టెక్కలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ మండలంలో కలియదిరుగుతున్నారు. గొల్లూరులో గ్రామస్తులను ఉద్దేశించి ఇలా మాట్లాడారు. ఎంపీ తిలక్ కూడా ఉన్నారు. -నందిగాం



ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నియోజకవర్గమంతా తిరిగేస్తున్నారు. ఆనందపురం ఎన్నికల ప్రచారంలో ఇలా సంక్షేమ పథకాలు వివరించారు.

-జి.సిగడాం



నందిగాం : ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. పెద్దతామరాపల్లిలో తిలక్‌కు మహిళలు ఇలా విజయ తిలకం దిద్దారు.

కుల సమావేశానికి అనుమతి లేకపోయినా..!

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక గ్రాండ్ హోటల్‌లో కళింగ కోమటి సామాజికవర్గంతో శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ మంగళవారం ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. వాస్తవానికి కోడ్ వచ్చాక కుల సమావేశాలు పెట్టకూడదనే నిబంధన ఉంది. అయినా సమావేశానికి సంబంధించి తమకు సమాచారం ఇవ్వకపోవడంతో ఎన్నికల అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది సమావేశం జరుగుతున్న చోటుకు వెళ్లారు. అక్కడ ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. అధికారులతో పాటు పోలీసులు ఇదే విషయమై అభ్యర్థి శంకర్‌ను అడ గ్గా తనకు అన్ని రకాల అనుమతులున్నాయని చెప్పడంతో ఫొటోలు తీసుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

కూటమి మేనిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదు


అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం అర్బన్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోను రాష్ట్ర ప్రజలు విశ్వసించడం లేదని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014లో విడుదల చేసిన మేనిఫెస్టోలో పది శాతం కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఎన్నికల ముందు రంగురంగుల మ్యానిఫెస్టో విడుదల చేయడం, అనంతరం వాటిని బుట్ట దాఖలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. 2019లో జరిగిన ఎన్నికల నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోను భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా భావించి 99 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. ఇన్నాళ్లూ సీఎం జగన్ హామీలను అమలు చేస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంకలా మారుతుందని చంద్రబాబు విమర్శించారని, ఇప్పుడు మీరిచ్చిన ఉచిత హామీలతో రాష్ట్రం సింగపూర్ అవుతుందా అని ప్రశ్నించారు.

'ఆంధ్రులను మోసగించిన బీజేపీకి ఓటు వేయవద్దు'


మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

శ్రీకాకుళం అర్బన్/ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రులను మోసగించిన బీజేపీకి ఓటు వేయవద్దని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తులనే గెలిపించాలని మేధావుల ఫోరం చైర్మన్, ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కులు, ఆత్మగౌరవ యాత్ర పర్యటనలో భాగంగా మంగళవారం శ్రీకాకుళంలోని రామలక్ష్మణ కూడలి వద్దనున్న ఓ ప్రైవేటు అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో ఆంధ్రులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్ తదితర హామీలు ప్రకటించారని, ఏ ఒక్క హామీని కూడా కేంద్రం అమలు చేయలేదన్నారు. అలాంటి పార్టీతో టీడీపీ, జనసేన పార్టీలు పొత్తుపెట్టుకుని కూటమిగా ఏర్పడటం దారుణమన్నారు. ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉన్నామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చెప్పారని, మరి ఎందుకు కూటమి మేనిఫెస్టోలో చేర్చలేదని ప్రశ్నించారు. అంతకు ముందు చిలకపాలెంలో చలసాని సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి ప్రతినిధులు గొలివి నర్సునాయుడు, అప్పలనాయుడు, డాక్టర్ జస్వంత్‌నాయుడు, పత్తిపాటి, గుంటూరు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి ఓటు వేస్తే మతతత్వ శక్తులకు ఓటు వేసినట్లే'


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: దేశాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీకి ఓటువేస్తే మతతత్వ శక్తులకు ఓటు వేసినట్లేనని డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞానభవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సమావేశంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి చాపర వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం అసెంబ్లీ అభ్యర్థి అంబటి కృష్ణారావు, ఆమదాలవలస అసెంబ్లీ అభ్యర్థి సనపల అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఓబీలో 22,300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసు బలగాలు

మెళియాపుట్టి: మండలంలోని ఏఓబీ సరిహద్దు భరణికోట పంచాయతీ మర, బాలేరు, ఒడిశాలోని మర్రిగుడ్డి, కొయ్యార గ్రామాల్లో సారా తయారీ స్థావరాలపై మంగళవారం ఈఎస్ తిరుపతినాయుడు, ఏఈఎస్ ఐ.బేగం ఆధ్వర్యంలో టెక్కలి, పలాస డీటీఎఫ్, ఎస్‌ఈబీ, ఇంటిలిజెన్స్ బృందాలు మెళియాపుట్టి పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించారు. 22,300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 500 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం ఎస్‌ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ దాడుల్లో సీఐలు రామచంద్ర కుమార్, రాజశేఖర్ నాయుడు, మెళియాపుట్టి ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో టీడీపీ గోవిందా.. గోవింద!

- టికెట్ ఖరారయ్యాక మామిడి గోవిందరావు పట్టించుకోవడం లేదంటున్న కార్యకర్తలు
- టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు


పార్టీలో చేరిన కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 టీడీపీ నాయకులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతోంది. ఆ పార్టీకి మండల, పంచాయతీ, గ్రామస్థాయిలో కీలక నాయకులు గుడ్‌బై చెప్పేస్తున్నారు. తమకు గుర్తింపు లేని పార్టీలో ఎన్నాళ్లు పనిచేస్తామని ఆందోళన చెందుతూ వైఎస్సార్ సీపీకి చేరువవుతున్నారు. ఇప్పటి వరకు కలమట వెంకటరమణను నమ్ముకున్న నాయకులంతా నేడు అధికార పార్టీ గూటికి చేరిపోతున్నారు. పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ను కోట్లాది రూపాయలకు అమ్ముకుని, పార్టీ కోసం పనిచేసిన వారికి అధిష్టానం మొండిచేయి చూపించిందన్న ఆవేదనతో టీడీపీకి ఆ పార్టీ నాయకులు దండం పెట్టేస్తున్నారు. ఇలాంటి పార్టీలో కొనసాగలేమని తెగేసి చెబుతున్నారు. 2019లో పాతపట్నం ఎమ్మెల్యేగా రెడ్డి శాంతి గెలిచిన తర్వాత నియోజకవర్గ స్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎక్కడ ఎలాంటి హాని జరగలేదని, రెడ్డి శాంతి పాలన ఎంతో సంతోషకరంగా సాగిందని టీడీపీ నాయకులు బాహాటంగా చెబుతున్నారు. ఎలాంటి గుర్తింపు లేని టీడీపీలో పనిచేసే కంటే రెడ్డి శాంతితో కలిసి పనిచేయడమే మంచిదని భావిస్తున్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన హిరమండలంలోని అవలంగి, గులుమూరు టీడీపీ నాయకులు

టికెట్ వచ్చాక ముఖం చాటేసిన ఎంజీఆర్..

పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా మామిడి గోవిందరావు(ఎంజీఆర్)కు టీడీపీ అధిష్టానం టికెట్ ప్రకటించి 40 రోజులు అవుతున్న ఇప్పటి వరకు అనేక మంది నాయకులు ఆయన కలవలేదని పలువురు టీడీపీ నాయకులు లోలోన మదన పడుతున్నారు. ఇలాంటి గుర్తింపు లేని వ్యక్తి దగ్గర పని చేసిన కంటే వైఎస్సార్‌సీపీలో చేరడమే మంచిదంటున్నారు. కింజరాపు కుటుంబం జోక్యం చేసుకుని సర్దిచెప్పడంలో కూడా వైఫల్యం చెందిందని ఆరోపిస్తున్నారు. ప్రతి చిన్న సమస్యకు ఎంపీ వద్దకు వెళ్లలేమని.. ఒకవేళ అక్కడికి వెళ్లినా న్యాయం జరుగుతుందన్న భరోసా లేదని.. ఇబ్బందులు పడుతూ ఇక్కడ కొనసాగలేమని చర్చించుకుంటున్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి..

- ఎల్.ఎన్.పేట మండలం శ్యామలాపురం పునరావాస కాలనీకి చెందిన వైస్ సర్పంచ్ రేగాన మోహనరావు 150 మంది అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు.
- కొత్తూరు మండలం దాశరథీపురం గ్రామస్తులు ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ సర్పంచ్ పారశెల్లి బయన్న, పారశెల్లి డిల్లీ, గెదెల సుందరనారాయణ, యర్లంకి రవణయ్య, యర్లంకి క్రిష్ణ, మజ్జి ఆనందరావు తదితరులు చేరారు.
- కొత్తురు మండలం బత్రిపేటవీధికి చెందిన రైతు సోమేశ్వరరావు, అదపాకల శేషగిరి, అదపాకల కృష్ణారావు, ఊయల షణ్ముఖ, బత్రిపేట యూత్ సహా 70 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి.
- హిరమండలంలోని దుగ్గపురం వీధికి చెందిన సవాఖాపురం బాలు, రాగోలు ఆదినారాయణతో సహా 30 కుటుంబాలు జగనన్నకు జైకొట్టాయి.
- మెళియాపుట్టి మండలం గొడ్డ, డబారు, కెరాసింగి తదితర గ్రామాలకు చెందిన 100 కుటుంబాల వారు టీడీపీ వీడి వైఎస్సార్ సీపీలో చేరారు.
- కొత్తూరు మండలం ఓంద్రుజోలకు చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ ఎస్.పక్కృష్ణారావుతో పాటు 100 కుటుంబాలు, హిరమండలంలోని అవలంగి, గులుమూరు గ్రామాలకు చెందిన సుమారు 200 కుటుంబాలు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.
- ఇటీవల ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో పలు గిరిజన గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.


ఎల్.ఎన్.పేట మండలం శ్యామలాపురం (ఆర్‌అండ్‌ఆర్ కాలనీ) గ్రామానికి చెందిన టీడీపీ నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పార్టీలో చేరిన మెళియాపుట్టి మండలం గొడ్డ, డబారు, కెరాసింగి గిరిజనులు

బాబుకు బైబై..జగనన్నకు జైజై


బూర్జ: కాలపర్తిలో టీడీపీ వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


వజ్రపుకొత్తూరు: పార్టీలో చేరిన బుడార్సింగి పంచాయతీ టీడీపీ కార్యకర్తలతో మంత్రి సీదిరి అప్పలరాజు

- వైఎస్సార్‌సీపీలో భారీగా చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

శ్రీకాకుళంరూరల్: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మి అనుచరుడు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మీడియా అధ్యక్షుడు మెండా గిరీష్ ప్రతాప్ మంగళవారం మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శ్రీకాకుళంలోని మంత్రి ధర్మాన క్యాంపు కార్యాలయంలో కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మామిడి శ్రీకాంత్, దుంగ సుధ, మెంటాడ స్వరూప్, తెలుగు రమేష్, కునుకు గోవింద, లక్ష్మణ, సింహాద్రి, శ్రీను, సురేష్, శ్యామ్, మౌనిక పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గుజరాతీపేటలో టీడీపీకి చెందిన 80 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన వారిలో ఎండ్ల వెంకటి, మురపాల శ్రీను తదితరులు ఉన్నారు.

బూర్జ: మండలంలోని అయ్యవారిపేట, కాలపర్తి, లాభం గ్రామాలకు చెందిన 40 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. కాలపర్తి గ్రామంలో స్పీకర్, ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఇప్పిలి తిరుపతిరావు, పీరుకట్ల సూరిబాబు, గేదెల చిన్నమ్మ, గేదెల కిషోర్, మామిడి మణికంఠ, చింతనిప్పుల దుర్గారావు, మామిడి మహేష్, కీర్తి రవి, మామిడి రాజకుమార్, మెరక సురేష్, మామిడి ఉమామహేశ్వరరావు, దూబ మహేష్, తాడేల నవీన్(అయ్యవారిపేట), సనపల జగన్నాథరావు, పైడి లక్ష్మణరావు, దేవర పల్లి మోహనరావు, దానేటి లక్ష్మణరావు, బగాది జగన్నాథరావు, బగాది రామినాయుడు, దేవరపల్లి మోహనరావు(కాలపర్తి), లావేటి రాంబాబుతో సహా 10 కుటుంబాలు(లాభాం) వారు ఉన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తి నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్, మండల సచివాలయ కో–ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బిర్లంగి వరహాలునాయుడు, బి.గోపాలరావు, డి.ఆనందరావు, ఎస్.గోవిందరావు, మాధవరావు, దాసు, బొడ్డేపల్లి నాగరాజు, బొడ్డేపల్లి నారాయణమూర్తి, పప్పల వెంకటరమణ, బెజ్జి సూరపు అప్పలనాయుడు, గోవిందరావు, గురుగు బెల్లి కృష్ణ పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన పలువురు యువకులు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో యవ్వారి అరుణ్‌కుమార్, బమ్మిడి తులసమ్మ, బగాది బాలరాజు, టొంప మహాలక్ష్మీ తదితరులు ఉన్నారు. వీరికి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కండువాలు వేసి ఆహ్వానించారు.


శ్రీకాకుళం రూరల్: పార్టీలో చేరిన గుజరాతీపేట కార్యకర్తలతో మంత్రి ధర్మాన ప్రసాదరావు


శ్రీకాకుళం రూరల్: టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మీడియా అధ్యక్షుడు మెండా గిరీష్ ప్రతాప్‌తో మంత్రి ధర్మాన ప్రసాదరావు


నందిగాం: రాంపురంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్


కాశీబుగ్గ: వైఎస్సార్ సీపీలో చేరిన లక్ష్మీపురం గ్రామస్తులతో మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: మందస మండలం బుడార్సింగి పంచాయతీలో టీడీపీకి చెందిన కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ సురేష్‌కుమార్ పాణిగ్రాహి ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం గోపినాథపురం ఎన్నికల ప్రచారంలో భాగంగా రవి, శంకర్, రాజాజీ, అభి, రాజు, విజయ్, శేఖర్, కోమలితో పాటు సుమారు 70 మంది కార్యకర్తలకు మంత్రి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు హనుమంతు వెంకరావు దొర, యు.ఉదయ్‌కుమార్, డాక్టర్ దున్న క్రిష్ణారావు, మరడ భాస్కరరావు, సర్పంచ్ కర్ని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మందస మండలం భేతాళపురం పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన సంగారు దుర్గాప్రసాద్, సంగారు వరప్రసాద్, తిమ్మల పాపారావు, జుత్తు రామలక్ష్మి, సంగారు దుర్గ తదితరులు మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్, మాజీ వార్డ్ మెంబర్ అడతాల ఎర్రయ్య, సచివాలయ కన్వీనర్ అడతాల మనోజ్, సంగారు పురుషోత్తం, సంగారు సోమయ్య, దున్న పేరయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- స్పందించిన ఎమ్మెల్యే గొర్లె కిరణ్


ఘటనా స్థలంలో ఎమ్మెల్యే

జి.సిగడాం: రాజాం–పొందూరు ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో సీతంపేట నుంచి ఎన్నికల ప్రచారం ముగించుకుని వస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కారు ఆపి వెంటనే 108 సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయరావు, జి.సిగడాం ఎన్నికల ఇన్‌చార్జి బూరాడ చిన్నారావు, కన్వీనర్ మాడుగుల మురళీధర్‌బాబా సహకారంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

నది మధ్యలో యువకుడు ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గార: మండలంలోని శాలిహుండం–పూసర్లపాడు గ్రామాల పరిధిలో వంశధార నది మధ్య ఓ చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. మంగళవారం మధ్యాహ్నం నదిలో చేపలు పట్టేవాళ్లు చెట్టుకు ఉన్న మృతదేహాన్ని చూసి వీఆర్‌వో పాపారావుకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో సోషల్ మీడియా ద్వారా ఆరా తీస్తున్నారు. తెలిసిన వారు గార పోలీస్‌స్టేషన్‌కు సంప్రదించాలని ఎస్సై కె.కృష్ణప్రసాద్ కోరారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

టెక్కలి రూరల్: బన్నువాడ గ్రామానికి చెందిన పోలాకి రామారావు(70) అనే వృద్ధుడు మంగళవారం వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఈ మేరకు స్థానికులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారావు మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. తిరిగి వస్తూ గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వృద్ధుడిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎండ వేడి వల్ల వడ దెబ్బతగిలి మృతిచెంది ఉండవచ్చని తెలిపారు. రామారావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మానవత్వం పరిమళించిన వేళ..


సపర్యలు చేసిన అనంతరం మహిళతో పోలీసులు


మతిస్థిమితం లేని మహిళ

నందిగాం: మతిస్థిమితం లేక జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ మహిళను నందిగాం పోలీసులు సపర్యలు చేసి ఆదుకున్నారు. ఎస్పీ జి.రాధిక శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తుండగా మార్గమధ్యలో నందిగాం మండలం పాలవలస వద్ద ఓ మహిళ మతి స్థిమితం లేకుండా జాతీయ రహదారిపై వెళుతుండటం గమనించి కారు ఆపారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీకి ఫోన్ చేసి, పరిస్థితి వివరించి ఆమెకు కొత్త దుస్తులు అందజేయాలని ఆదేశించి కొంత సొమ్ము ఇచ్చారు. దీంతో నందిగాం ఏఎస్సై వరలక్ష్మీ, ఎస్సై సదరు మహిళలకు సపర్యలు చేసి కొత్త దుస్తులు ఇప్పించి భోజనం పెట్టారు. పోలీసుల ఔదార్యాన్ని స్థానికులు అభినందించారు.

చంద్రబాబుకు సీఎం అయ్యే అర్హత లేదు

- జగన్ నాయకత్వం రాష్ట్రానికి మళ్లీ అవసరం
- పుట్టిన రోజు వేడుకలో మంత్రి ధర్మాన, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో పేరాడ తిలక్ తదితరులు

శ్రీకాకుళం అర్బన్: 40 ఏళ్ల అనుభవం, 14 ఏళ్ల సీఎం అని చెప్పుకునే దగాకోరు చంద్రబాబుకు మరోసారి ముఖ్యమంత్రి అయ్యే అర్హత లేదని రాష్ట్ర రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సీపన్నాయుడిపేట గ్రామానికి చెందిన అన్నెపు గోవింద్ పుట్టిన రోజు వేడుకలకు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి ధర్మాన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 టీడీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని,. ఇపుడు మరోసారి ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించి వంచించేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. ఎవ్వరూ పట్టించుకోని, నిర్లక్ష్యం చేసిన అంశాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాజకీయాలకు అతీతంగా అమలు చేసి మనసున్న మారాజుగా నిలిచారని చెప్పారు. క్యాబినెట్‌లో రెడ్లకు ప్రాధాన్యం తగ్గించి అన్ని కులాలకు ప్రాధాన్యత ఇచ్చారని, చంద్రబాబు అలా చేయగలరా అని ప్రశ్నించారు. ఇపుడు జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కూడా పేదలకు, వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు పార్టీ టికెట్లు కేటాయించారని గుర్తు చేశారు. విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని గ్రహించి నాడు–నేడు పేరుతో విద్యావ్యవస్థలోనే సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. విభజన సమయంలో ఉమ్మడి రాజధానిగా 10ఏళ్లపాటు హైదరాబాదు కొనసాగుతుందని చట్టంలో ఉందని, దీనిని కాదని అమరావతియే రాజధానిగా అభివృద్ధి చేసుకుందామని చెప్పి ఇక్కడికి తరలివచ్చి అందరినీ భ్రమలో ఉంచేశారన్నారు. ఇదా 14 ఏళ్ల సీఎంగా బాబుకు ఉన్న అనుభవం అని ప్రశ్నించారు. ఇటువంటి వ్యక్తి మళ్లీ సీఎం అయితే ప్రజల భవిష్యత్తు అధోగతిపాలవుతుందన్నారు. విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర ప్రజల భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. దీనిని టీడీపీ, జనసేన పార్టీలు అడ్డుకోవడం శోచనీయమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి, ప్రజల భవిష్యత్తు టీడీపీ, జనసేన పార్టీలకు అక్కర్లేదా అని ప్రశ్నించారు. విభజన సమయంలో రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం 23 సంస్థలను కేటాయించగా వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు ఒక్కటంటే ఒక్క సంస్థను కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. దీనిపై ఏ ఒక్క టీడీపీ నాయకుడు ప్రశ్నించకపోవడం శోచనీయమన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం నష్టపోయిందని విష ప్రచారం చేస్తున్నారని, మీ ఇళ్లలో కంప్యూటర్ ఆన్ చేసి అన్ని రంగాల ప్రగతి నివేదికలను పరిశీలించాలన్నారు. అపుడే రాష్ట్రం అభివృద్ధి పరంగా ఎంత ముందంజలో ఉందనేది గణాంకాలే చెబుతాయన్నారు. అసెంబ్లీ టికెట్లు అమ్ముకునే పప్పు లోకేష్ కూడా జగన్‌ను విమర్శించడం శోచనీయమన్నారు. తనను శ్రీకాకుళం శాసనసభ అభ్యర్థిగా, పేరాడ తిలక్‌ను ఎంపీ అభ్యర్థిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిపారని, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి గెలుపునకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

వంచించేందుకే టీడీపీ మేనిఫెస్టో..

సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలు ఆచరణ సాధ్యం కాదని పదే పదే చెప్పిన చంద్రబాబు ఇపుడు అవే పథకాలను మూడు రెట్లు పెంచి ఇస్తానని చెప్పడం ప్రజలను మరోసారి వంచించేందుకేనని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ దుయ్యబట్టారు. తనకు ఎంపీ అభ్యర్థిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారంటే అందుకు కారణం కళింగ జాతిలో పుట్టడమేనన్నారు. కళింగ జాతికి తాను ఎపుడూ రుణపడి ఉంటానన్నారు. తనకు పెద్ద రాజకీయ నేపథ్యం లేదని, సంపన్న కుటుంబంలో కూడా పుట్టలేదన్నారు. తన రాజకీయ జీవితాన్ని దివంగత హనుమంతు అప్పయ్యదొరతో ప్రారంభమైందని, నాటి నుంచి నేటి తరం నాయకుల వరకూ అందరితోనూ మంచిగా కలిసి పనిచేసి ఈస్థాయికి చేరుకున్నానని చెప్పారు. మీ అందరి ఆదరాభిమానాలు, ప్రోత్సాహం చూస్తుంటే తన గెలుపు ఖాయమనే నమ్మకం వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పనిచేసి ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసేలా అవగాహన కల్పించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని కోరారు. దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు చేసిన కృషి, దయ వల్లే కళింగజాతి ఈస్థాయిలో ఉందన్నారు. అటువంటి వ్యక్తి శతజయంతోత్సవాలు తన చేతులమీదుగా నిర్వహించడం తనకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. ఇందుకు కృషి చేసిన వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో కళింగకుల ప్రతినిధులు గుంట తులసీరావు, దుంపల లక్ష్మణరావు, పప్పల జగన్నాధరావు, గురుగుబెల్లి లోకనాథం, ఎన్ని ధనుంజయరావు, డా.పైడి మహేశ్వరరావు, మొదలవలస లీలామోహన్, గుంట జ్యోతి, సీపాన రామారావు, బిర్లంగి రామ్మోహనరావు, సనపల నారాయణరావు, సంఘ పెద్దలు, ప్రతినిధులు పాల్గొన్నారు.